ప్రజాశక్తి

శుక్రవారం 13 డిసెంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పాత పద్ధతిలోనే వడపోత

- ఆరు అంశాల ప్రాతిపదికన పింఛన్ల పరిశీలన
- వికలాంగుల అర్హతపైనే అధికారుల దృష్టి
- 50 శాతం తక్కువ ఉంటే పున:పరిశీలనకు ఉత్తర్వులు?



పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంభంపాడులో పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక పింఛన్లలో అనర్హుల ఏరివేతకు కూటమి ప్రభుత్వం కూడా వైసిపి ప్రభుత్వ బాటలోనే పయనిస్తోంది. అప్పట్లో వైసిపి ప్రభుత్వం ఆరు అంచెల పద్ధతిని పాటించింది. కూటమి ప్రభుత్వం కూడా ఇదే రీతిలో పింఛన్ల పరిశీలనలో ఇటీవల ఇవే మార్గదర్శకాలను పాటించింది. దీంతో అప్పట్లో వైసిపి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఎటువంటి కొత్త మార్గదర్శకాలు లేకుండానే గతంలో ఉన్న ఆరు అంచెల విధానాన్ని కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది.

ఈనెల 9, 10 తేదీల్లో పైలట్ ప్రాజెక్టులో భాగా జిల్లాకు ఒక్క గ్రామం చొప్పున గుంటూరు జిల్లా వేజెండ్ల, పల్నాడు జిల్లా కంభంపాడు అధికారులు ఇంటింటికి వెళ్లి పింఛను దారులను పరిశీలించారు. అధికారులు తమ ఫోన్ యాప్‌లో ఉన్న ప్రశ్నావళి ప్రకారం లబ్ధిదారులు నుంచి వివరాలు సేకరించి, ఆధార్ కార్డు, వికలాంగుల సర్టిఫికేట్ తదితర పత్రాలను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

గతంలో ఉన్న ఆరు అంశాలు లబ్ధిదారుల కుటుంబ సభ్యులలో ఎవరికైనా సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేల ఆదాయం, మాగాణి 3 ఎకరాలు, మెట్ట 10 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్నా, నాలుగు చక్రాల వాహనం వున్నా, కుటుంబంలో ఉద్యోగి లేదా రిటైర్డు ఉద్యోగి ఉన్నా, 300 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్నా, ఐటి చెల్లింపుదారుడు ఉన్నా అనర్హుడుగా పేర్కొన్నారు. ఇప్పుడే ఇదే విధానం నిర్దేశించారు. పట్టణ ప్రాంతాల్లో 1000 చదరపు అడుగుల ఇంటి స్థలం ఉన్నా అనర్హులుగా చెబుతున్నారు. ఈ ఆరు అంశాలను నమోదు చేసి అర్హత, అనర్హత ప్రాతిపదికన నమోదు ప్రక్రియ చేపట్టారు.

వికలాంగులకు సంబంధించి 50 శాతం లోపు వైకల్యం ఉంటే మరోసారి ధృవపత్రాలు తీసుకోవాల్సి ఉంటుందని నిర్ధారించారు. అయితే ఆరు అంశాలపై గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలించి అనర్హులను పక్కన బెడుతూ వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం ఎక్కువగా వితంతువుల్లో మళ్లీ వివాహం చేసుకున్న వారిని, చేనేత కార్మికులుగా నమోదు అయినా ఆ వృత్తి చేయని వారిని, అలాగే డప్పుకళాకారులు వృత్తులపై కూడా దృష్టి సారించింది. వీరి వృత్తులకు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఈమేరకు త్వరలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆరు అంశాలను ప్రాతిపదికన చేసుకుని వడపోతకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది. వేజెండ్ల, కంభంపాడులో దాదాపు 100 పింఛన్ దారులను అనర్హులుగా గుర్తించినట్టు తెలిసింది. మొత్తంగా ఉన్న పింఛన్లలో 30 శాతం వరకు అనర్హులుగా ఉన్నారని కలెక్టర్లు గత రెండు రోజులుగా జరిగిన సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా వికలాంగుల పింఛన్లపై దృష్టి సారించాలని సిఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో అధికారులకు సూచించారు. కనీసం 60 శాతం వైకల్యం ఉంటేనే పింఛన్లు ఇవ్వాలన్న నిబంధన తేవాలని ప్రభుత్వానికి కొంత మంది అధికారులు సూచించినట్టు తెలిసింది. వీటితో పాటు ఆరు అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని త్వరలో రెండు జిల్లాల పరిధిలో వడపోత జరగనుంది. గుంటూరు జిల్లాలో గత నెల 30న విడుదల చేసిన జాబితా ప్రకారం 2,54,610 మంది, పల్నాడు జిల్లాలో 2,74,209 మంది ఉన్నారు. వీరి సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో త్వరలో కసరత్తు జరగనుందని తెలిసింది. అంతేగాక ఆధార్ అప్‌డేషన్ ద్వారా వయస్సు వివరాలను కూడా పరిశీలించనున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు, ఎల్లుండి సిపిఎం గుంటూరు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శని, ఆదివారాల్లో జరిగే 25వ గుంటూరు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మహాసభల ప్రాంతానికి సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి నగర్ అని, మహాసభ హాల్‌కు వల్లభనేని సాంబశివరావు ప్రాంగణం అని నామకరణం చేశామన్నారు. 14న ఉదయం 10 గంటలకు జెండా ఆవిష్కరణతో సభ ప్రారంభం అవుతుందన్నారు. మహాసభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, డి.రమాదేవి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు హాజరవుతారని చెప్పారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో సమగ్రంగా చర్చించి, తీర్మానాలు చేస్తామన్నారు. విద్యుత్ చార్జీల భారాలు, జిల్లా సమగ్రాభివృద్ధి, రాజధాని అభివృద్ధికి నిధులు, పేదలకు ఇళ్ల పట్టాలు, గుంటూరు ఛానల్ విస్తరణ, నల్లమడ వాగు ఆధునీకరణ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2లో

గుడిసెలను కూల్చేయించిన

కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

ఎసిసి సిమెంట్ కార్మికుల దీక్షలకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు సంఘీభావం

2లో

పశువుల్లో లంపి స్కిన్ వ్యాప్తి

ప్రజాశక్తి-ముప్పాళ్ల



దేశాన్ని కుదిపేస్తున్న లంపి స్కిన్ వ్యాధి మండలంలోని పలు గ్రామాల్లోనూ విస్తరిస్తూ తెల్ల పశువులను బలి తీసుకుంటోంది. మండలంలో 50కి పైగా ఆవులు, ఎద్దులు, ఆవు దూడలు ఈ వ్యాధి బారిన పడినట్లు సమాచారం. వ్యాధి బారిన పడి పశువులకు వేల రూపాయలు ఖర్చు చేసి మందులు తెచ్చి వాడినా ప్రయోజనం లేకపోగా రోజుల వ్యవధిలోనే మృత్యువాత పడుతున్నాయి. వ్యాధి బారిన పడిన పశువులకు ఒంటిమీద దద్దుర్లు, వాపులతో పెద్ద పెద్ద పుండ్లు ఏర్పడుతున్నాయి. వాటి నుండి చీముతో కూడిన రక్తం కారుతోంది. ఈ వ్యాధికి వ్యాక్సి న్‌ను ఇంకా కనుగొనకున్నా గొర్రెలు, మేకలలో కనబడే గోట్ పాక్స్ వ్యాధి మాదిరిగానే ఉందని పశు సంవర్ధక శాఖ అధికారులు ఇదే వ్యాక్సిన్‌ను వేస్తున్నారు. అయినా వ్యాధి కట్టడి అవ్వకపోగా విస్తరిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో పశు పోషకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులు పశుపోషణతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. లంపిస్కిన్ వ్యాధి వల్ల తమ పశువులకు ఏమవుతుందోనని, తమ ఆర్థిక పరిస్థితి మరింతగా కుదేలవుతుందని పాడిరైతులు కంగారు పడుతున్నారు. దీనిపై మాదల పశువైద్యులు డాక్టర్ పుల్లారెడ్డిని వివరణ కోరగా మండలంలో తక్కువ సంఖ్యలోనే లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువులు ఉన్నాయని చెప్పారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న దూడలకు వ్యాధి తీవ్రత ఉందన్నారు. పాడి రైతులు తమ పశువుల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ దోమల బెడదను నివారిస్తే ఒకదాని నుండి మరోక పశువుకు వ్యాధి వ్యాపించకుండా నివారించొచ్చని అన్నారు.

ఔటర్ రింగ్‌రోడ్డు పూర్తికి చర్యలు : సిఎం

యుజిడికి నిధులివ్వండి : కలెక్టర్

2 - లో

ధర దక్కక వరి రైతులకు రూ.60 కోట్ల నష్టం

- తేమశాతం పేరుతో ధర దిగ్గోత
- పత్తిలోనూ ఎకరాకు రూ.10-20 వేల నష్టం
- మద్దతు ధరల కోసం మిర్చి రైతుల నిరీక్షణ
- పంటలన్నింటినీ నిబంధనలు సడలించి మద్దతు ధరకు కొనాలని కౌలురైతు సంఘం డిమాండ్

4లో



విద్యుత్ బిల్లు ప్రతుల దహనం

ప్రజాశక్తి-ముప్పాళ్ల, ఫిరంగిపురం



పొనుగుపాడులో

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ బిల్లులను సిపిఎం శ్రేణులు దహనం చేశాయి. ఈ మేరకు పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో గురువారం బిల్లు ప్రతులను దహనం చేశారు. సిపిఎం ముప్పాళ్ల మండల కార్యదర్శి జి.బాలకృష్ణ, ఫిరంగిపురం మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ట్రూఅప్, సర్దుబాటు పేరుతో భారాలు మానుకోవాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఆదానీ సంస్థలతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. నిరసనల్లో ఎం.వెంకటరెడ్డి, కె.సాంబశివరావు, జి.జాలయ్య, కె.నాగేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లు, కె.లీలాశ్రీనివాసరావు, డి.చిన్నారావు, జి.వెంకటే శ్వరరావు, కె.రాఘవయ్య, కె.కోటేశ్వరరావు, ఖాజా మస్తాన్‌వలి, రమణ, కె.వెంకటరావు, మణికంఠ పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి సిపిఎం గుంటూరు జిల్లా మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

అవలంబిస్తున్న విధానాల వల్ల నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకీ పెరుగుతూ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయన్నారు. విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని ఎన్నికలప్పుడు వాగ్దానం చేసిన కూటమి అధికారంలోకి వచ్చాక సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిందని, ఆరు నెలల పాలనలోనే రూ.16 వేల కోట్ల భారం మోపిందని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా మహాసభల్లో తీర్మానించి, రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణకు సిద్ధం అవుతుమన్నారు. జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ధాన్యం, పత్తి, శనగ పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనాలని, పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తిచేయాలని కోరారు. ఈ అంశాలపై మహాసభలో చర్చిస్తామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, నగర కార్యదర్శి కె.నళినికాంత్, నాయకులు బి.శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, ఎమ్.ఎ.చిస్టీ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకొని దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. నరసరావుపేట మండలం ములకలూరులో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రీసర్వే ద్వారా రైతులకు గత ప్రభుత్వం కొత్త సమస్య సృష్టించిందని, రీ సర్వే వల్ల వచ్చిన సమస్యలతో పాటు చుక్కల భూములు, 22ఎ, వెబ్ ల్యాండ్, ఇతర సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. తహశీల్దార్ కె.వేణుగోపాలరావు, ఎంపిడిఒ టివి కృష్ణకుమారి మాట్లాడుతూ భూమికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం గ్రామంలో తడిచెత్త, పొడి చెత్త సేకరణ విధానం, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌కు తరలించే విధానాలను ఎంపిడిఒ పరిశీలించారు. కార్తికేయ డెవలపర్స్ బి.నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన మొక్కలను నాటారు.

అన్నక్యాంటీన్‌లో పరిశీలన

నరసరావుపేటలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతను, పరిసరాలను పరిశీలించారు. భోజనం కోసం వచ్చిన వారితో మాట్లాడారు.

క్రీడల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - పెదకూరపాడు : స్థానిక శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందించారు. కబడ్డీలో 30 జట్లు తలపడగా మాదల జట్టు విజేతగా నిలిచింది. తరువాతి స్థానాల్లో అంజి మెమోరియల్, గుంటూరు స్కై, సత్తెనపల్లికి చెందిన సైదా జట్టు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతితోపాటు షీల్డ్‌లు అందించారు. బెస్ట్ రైడర్‌గా మల్లికి రూ.వెయ్యి, బెస్ట్ డిఫెండర్‌గా ప్రకాష్‌కు రూ.వెయ్యి ప్రోత్సాహకాలు అందించారు. వాలీబాల్‌లో 30 జట్లు తలపబడగా విజేతగా వికాస్ కాలేజీ నిలిచింది. తరువాతి స్థానాల్లో పెదకూరపాడు, ప్రకాశం, కొత్తపాలెం జట్లు నిలిచాయి. బెస్ట్ ఎటాకర్‌గా ముఖేష్, బెస్ట్ ఆల్ రౌండర్‌గా శామ్‌సన్, బెస్ట్ సెటర్‌గా రాజేష్, బెస్ట్ లిఫ్టర్‌గా తిరుపతిరెడ్డికి బహుమతులు అందుకున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో 25 జట్లు తలపడగా నాన్ మెడలిస్టులో మొదటి బహుమతి రూ.10 వేలను నరసరావుపేట జట్టు గెలుసుకుంది. రెండో బహుమతి రూ.6 వేలను విజయవాడ జట్టు, మూడో బహుమతి రూ.3 వేలను బిజవాడ జట్టు, నాలుగో బహుమతి రూ.2 వేలను జిఆర్‌సిఆర్‌కె జట్టు దక్కించుకున్నాయి. మెడలిస్టులో మొదటి బహుమతి రూ.5 వేలను విజయవాడ జట్టు, రెండో బహుమతి రూ.3 వేలను నరసరావుపేట జట్టు అందుకున్నారు. బహుమతులను టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్‌తోపాటు ఇతర అతిథులు, నిర్వాహకులు గుప్తా, కవిత, రాము అందజేశారు.

ఔటర్ రింగ్ రోడ్డు పూర్తికి చర్యలు : సిఎం

యుజిడికి నిధులివ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని చుట్టూ నిర్మించనున్న అవుటర్ రింగ్ రోడ్డు 2026 డిసెంబరు కల్లా పూర్తి చేయడానికి కలెక్టర్లు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజు ఆయన గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన భూ సేకరణ ఇతర అంశాలపై దృష్టి సారించాలన్నారు.కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఈ సమావేశంలో మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2016లో చేపట్టిన యూజిడి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, రూ.903 కోట్ల ప్రాజెక్టుకు రూ.500 కోట్లవరకు ఖర్చు చేశారని తెలిపారు. మిగతా రూ.400 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ భరించాల్సి ఉందన్నారు. ఈ నిధులు ఇవ్వకపోవడం వల్ల ఈ పనులు 2019 నుంచి ఎక్కడికక్కడే నిలిచిపోయాయని తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటూ ఆర్థిక శాఖలో రూ.300 కోట్ల వరకు ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాగే గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థల్లో తాగునీటి సమస్యపై కలెక్టర్ ప్రస్తావించారు. మంగళగిరి, తాడేపల్లి పరిధిలో భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. వీరికి నీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. అయితే తెనాలి తప్ప గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తాడేపల్లి, రాజధాని ప్రాంతం మొత్తం కలిసిపోతున్నాయని



గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్.పి సతీష్‌కుమార్

త్వరలో ఏ ప్రాంతానికి అనుగుణంగా ఈ ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా కలెకర్లకు సూచించారు. ఈప్రాంతంలో మౌలిక సదుపాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మీ వందన సమర్పణ చేయగా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్‌పి కె.శ్రీనివాసరావు కూడా ఈసమావేశంలో పాల్గొన్నారు.

నేడు వైసిపి ఆధ్వర్యంలో రైతు ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను నరసరావుపేటలోని ఓ ఫంక్షన్‌హాలులో మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం రైతులను కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే నిలువునా మోసం చేసిందన్నారు. వైసిపి హయాంలో రైతులకు ఏడాదికి రూ.13 వేలు ఇచ్చాన్నారు. రూ.20 వేలు ఇస్తామని హామీనిచ్చిన కూటమి మొండి చేయి చూపిందని, బడ్జెట్లో సైతం రైతులకు ఇచ్చే సహాయంపై కేటాయింపులు లేవని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా లేవని, కేంద్రం ప్రకటించిన రూ 1700/- మద్దతు ధర రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు రాయితీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ఇవ్వడం లేదన్నారు. ధాన్యం, పత్తితో పాటు పండించిన ఇతర పంటలను అమ్ముకోలేక అప్పులపాలయ్యారన్నారు. వైసిపి నాయకులపై కేసులు పెట్టి ఎలా వేధించాలి అనే దానిపై ఉన్న శ్రద్ధను రైతులను ఆదుకునేందుకు చూపాలన్నారు.

రానున్న 5 ఏళ్లలో అన్ని రంగాల్లో ఏపీ ముందంజ : శ్రీధర్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి సాగిస్తున్న పాలనతో రానున్న 5 ఏళ్లలో భారతదేశంలో ఏపీ అన్ని రంగాల్లో ముందంజలో ఉండడం ఖాయమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపి పాలనలో అస్తవ్యస్తమైన వ్యవస్థలను కూటమి ప్రభుత్వ 6 నెలల్లోనే గాడిన పెట్టడం గొప్ప విషయమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా టిడిపి కృషి చేస్తుందని, విశాఖ రైల్వేజోన్‌కు మార్గం సుగమం అయ్యిందని అన్నారు. అమరావతి అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయన్నారు. ఇసుక విధానంలో కొన్ని అవరోధాలు ఉన్నాయని, త్వరితగతిన నిబంధనలు సడలించి ఇసుక అవసరమైన ప్రతి ఒక్కరికీ సరఫరా అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలో వచ్చిన వైసిపి చెత్త పన్నులు, ఇతర భారాలు వేసి దోచుకుందని, అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని విమర్శించారు. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి, మూడు రాజధానులు పేరిట ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూసిన జగన్మోహన్ రెడ్డికి ఎన్నికల ఫలితాలు చెంపపెట్టన్నారు. వైసిపి పాలనలో రోడ్లకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని, సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. 16347 ఉపాధ్యాయ పోస్టులు, 6100 పోలీసు ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు వరుస కడుతున్నారని విశాఖలో టిసిఎస్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా 10 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, ఎస్‌టి సెల్ అధ్యక్షుడు కోటా నాయక్ పాల్గొన్నారు.

చందవరంలో డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి - నాదెండ్ల : పంచాయతీలో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదు నేపథ్యంలో మండలంలోని చందవరం పంచాయతీలో డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణ గురువారం విచారణ చేపట్టారు. అనుమతి లేకుండా రక్షిత మంచినీటి కొళాయి కనెక్షన్లు బిగించి అనాధికార నగదు వసూళ్లు చేశారని, పంచాయితీ కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవినీతికి పాల్పడ్డారని, నిధులు దుర్వినియోగం చేశారని, ఉద్యోగుల పేరుతో జీతాలు స్వాహా చేశారని, బీసీలకు చెందిన 13 ఇళ్ల అసైన్మెంట్ నెంబర్లు మార్పు చేసి వైసిపి నాయకుల పేర్లతో రికార్డుల్లో చేర్చారని, పాఠశాలకు రిజిస్ట్రేషన్ చేసిన స్థలంలో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించారనే ఫిర్యాదులపై విచారణ చేశారు.

గుడిసెలను కూల్చేయించిన కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

ఎసిసి సిమెంట్ కార్మికుల దీక్షలకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు సంఘీభావం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న పోరాటం విజయవంతం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. కార్మికుల దీక్ష శిబిరాన్ని గురువారం సందర్శించిన ఆయన సిఐటియు నాయకులు వి.దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకర్‌రావు, కె.మేరీ, వి.శాస్త్రి, ఎం.దుర్గారావుకు పూలమాలేసి దీక్షలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అవసరమైతే రాష్ట్రస్థాయిలో ఉధృతం చేస్తామని, అన్ని సంఘాల మద్దతు కూడగడతామని చెప్పారు. భూములు అమ్మయినా కార్మికులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు వేసుకున్న గుడిసెలను కూల్చి వేయించిన ఎమ్‌టిఎంసి కమిషనర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరోవైపు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను మంత్రి లోకేష్ పరిష్కరించాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట మాట్లాడటం బూర్జువా రాజకీయ పార్టీలకు పరిపాటైందని విమర్శించారు. రైతుసంఘం నాయకులు జొన్న శివశంకరరావు, డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల పైబడి సుదీర్ఘంగా సాగుతున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కాలంలో అనేకమంది ఆకలి చావులు గురైనా పాలక పార్టీలకు పట్టడం లేదని విమర్శించారు. దీక్షలకు ఆశా వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకమ్మ, ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు



ఆర్‌వి రాఘవయ్య, ఆవాజ్ నాయకులు ఎస్‌ఎం బాష, ఐఎన్‌టియుసి నాయకులు డి.సామిల్ మద్దతు తెలిపారు. దీక్షల్లో పోరాట కమిటీ కన్వీనర్ కె.స్టీవెన్, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, కె.ఆదినారాయణ, వై.నాగేశ్వరరావు, బి.సూర్యప్రకాష్, ఎస్‌కె బాష, ఎమ్‌డి రహీమ్తుల్లా, ఎం.శాస్త్రి, ఎస్‌కె ఇమామ్‌బి, ఎం.శివకుమారి, రమాదేవి, టి.దుర్గా భవాని, సారమ్మ, డి.నాగమల్లేశ్వరి, రమణ, బుజ్జి, లక్ష్మి పాల్గొన్నారు.

మద్దతు ధరకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని - గోళ్లమూడి రోడ్డులోని వరి ధాన్యాన్ని సిపిఎం నాయకులు గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామారావు మాట్లాడుతూ 75కిలోల ధాన్యం బస్తా మద్దతు ధర రూ.1740కు కొనాల్సి ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ.1320 నుండి రూ.1400 మాత్రమే కొంటున్నారని చెప్పారు. వాతావరణంలో మార్పుల కారణంగా ధాన్యం తడిచి పోతుందనే ఆందోళనలో రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్నారని, ఈ ధాన్యం తేమ శాతం అధికంగా ఉందనే పేరుతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అనేక కష్టనష్టాల కోర్చి, అధిక వడ్డీలకు అప్పులు చేసి పంట పండిస్తే ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల వర్షాల కారణంగానూ పంట దిగుబడి తగ్గిందని, మరోవైపు తక్కువ ధర వల్ల రైతులు ఎకరాకు రూ.10-12 వేలు నష్టపోతున్నారని తెలిపారు. కౌలురైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ఎకరాకు కౌలు రూ.30-40 వేలు చెల్లించి పంటలు పండిస్తున్నారని, వారికి కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి ఎన్.శివాజి మాట్లాడుతూ ప్రతిగింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటనలు చేయడమేగాని ఆచరణ లేదన్నారు. 80 శాతం ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు పెట్టి నేరుగా మద్దతు ధరకు కొనాలని కోరారు. పత్తి, మిర్చి, శనగ పంటలను కూడా మద్దతు ధరకు కొనాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజారమేష్, కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



గోళ్లమూడిలో ధాన్యం రైతులతో మాట్లాడుతున్న పాశం రామారావు, ఎన్ శివాజి తదితరులు

పలు రాష్ట్రాల నుండి సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు అందజేసిన అదనపు ఎస్‌పి సుప్రజ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

సెల్‌ఫోన్లను దొంగిలించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించగా వారి నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకుని వాటిని బాధితులకు గురువారం అదనపు ఎస్‌పి సుప్రజ అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో రూ.33 లక్షల విలువైన 220 ఫోన్లను రికవరి చేసి అప్పగించినట్టు తెలిపారు. తమిళనాడు లో 3, కేరళ -1, వెస్ట్ బెంగాల్ -1, అస్సాం -1, కర్ణాటక -1 సెల్ ఫోన్లతో పాటు 220 సెల్ ఫోన్లను రికవరీ చేశామని అదనపు ఎస్‌పి తెలిపారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన ఎడల వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831574 ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సైబర్ నేరాల పట్ల అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. సైబర్ నేరాలు అనేక రూపాల్లో జరుగుతున్నాయని వివరించారు. పోలీసు ఐటీ కోర్ టీం సభ్యులు సీఐ నిషార్ భాష, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, రమేష్, కానిస్టేబుల్ శ్రీధర్, కరీముల్లా ఇమాం సాహెబ్, గౌస్ భాష,మానస పాల్గొన్నారు. వీరిని ఆమె అభినందించారు.



ఫిర్యాదు దారులకు ఫోన్లు అందచేస్తున్న అదనపు ఎస్‌పి సుప్రజ



ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో ట్రాఫిక్ సమస్యలను క్షేత్ర స్థాయికి వెళ్లి ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం వివిధ ప్రాంతాల్లో పరిశీలించారు. తొలుత బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, కోరిటేపాడు, గుజ్జనగుండ్ల వరకు ద్విచక్ర వాహన మీద ప్రయాణించి ట్రాఫిక్ సమస్యలను చూశారు. కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అవ్వటానికి కూడలలో చిరు వ్యాపారులు తోపుడు బండ్లను రోడ్ల మీద నిలపటమేనని గుర్తించామని మాధవి మీడియాకు తెలిపారు. ఓ షాపింగ్ కాంప్లెక్స్ లోకి వెళ్లి రోడ్డు మీద ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును పరిశిలించి, మంచి నాణ్యత కలిగిన కెమెరాలను ఏర్పాటు చేయవల్సినదిగా మాధవి కోరారు. గుజ్జనగుండ్ల ప్రాంతంలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించటం, ట్రాఫిక్ జాం అవ్వకుండా చూడటానికి వారి సిబ్బందిని నియమించ కుండా ఉండటం పై గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. జేకేసి కాలేజి రోడ్డు కూడలిలో కొంతమంది అనధికార ఆటో స్టాండ్ ఏర్పాటు చేసి ఆటోవాలాల వద్ద డబ్బులు చేయడాన్ని ఆమె తప్పుపట్టారు. పట్టాభిపురం మెయిన్ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేయటం వలన ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దష్టికి కొంతమంది తీసుకొనివచ్చారు. పట్టాభిపురంలో కొంతమంది ఆకతాయిలు తమని వేధిస్తున్నారని కొంతమంది విద్యార్థినులు ఎమ్మెల్యే దష్టికి తీసుకొనివెళ్ళగా, ఎమ్మెల్యే నేరుగా అక్కడికి వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశిలించి, ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులని ఆదేశించారు.



నాలుగు తాళం చెవులు మింగిన ఘనుడు

సురక్షితంగా బయటకు తీసిన జిజిహెచ్ వైద్యులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాళం చెవులు నాలుగు మింగిన ఒక యువకుడికి శస్త్రచికిత్స ద్వారా సురక్షితంగా బయటకు తీసిన ఘటన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం జరిగింది. నరసరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్ అనే యువకుడి వారి ఇంట్లో వాళ్ళతో గొడవ పడి 4 తాళం చెవులు మింగగా అతన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యశాల లోని గాస్ట్రోఎంట్రాలజి విభాగంలో చేర్చుకున్న వైద్యులు ప్రొఫెసర్ ఎ.కవిత నేతృత్వంతో కోత లేకుండా అరుదైన వైద్య చికిత్స ద్వారా తాళాలను బయటకు తీశారు. ప్రొఫెసర్ కవిత, ఈ విభాగంలోని సిబ్బంది సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్‌వి అభినందించారు.

పారిశుధ్య పనుల నిర్వహణపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో వార్డుల వారీగా ప్రజారోగ్యకార్మికులను హేతుబద్ధీకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్, సిఎంఒహెచ్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లతో నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొన్ని శానిటరీ డివిజన్లలో కార్మికులు ఎక్కువగా, మరి కొన్ని డివిజన్లలో తక్కువ మంది ఉన్నారని, వారిని తక్షణం హేతుబద్ధీకరించాలని సిఎంహెచ్ఒను ఆదేశించారు. జిఎంసి గోశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, గోశాలకు తీసుకొచ్చే ఆవుల వివరాలను పక్కాగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రోడ్ల మీద ఆవులను వదిలే వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని, గోశాలకు తరలించిన ఆవులను 10 రోజుల్లో యజమానులు రాకుంటే చట్ట పరంగా వేలం వేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఏఎంహెచ్ఓలు ఆనందకుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణి

ప్రజాశక్తి-తెనాలిరూరల్



పట్టణానికి చెందిన అంబియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణి చేశారు. సామాజిక సేవలో భాగంగా చెంచుపేటలో యేల్చూరి అమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వస్త్రాలతో పాటు దుప్పట్లు, పండ్లు పంపిణి చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యతలను తెలిపారు. వృద్ధులకు సేవచేయడం, వారిని గౌరవించుకోవడం భారతదేశ సాంప్రదాయాల్లో ఒకటని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఇర్షాద్ షేక్, డైరెక్టర్ షేక్ సల్మా, ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

10 పందెంకోళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని కంఠంరాజు కొండూరు చిలువూరు గ్రామాల మధ్య సపోటా తోటలో కోడిపందాల స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారం అందటంతో ఎస్ఐ ఎస్ వెంకట రవి తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులో తీసుకొన్నారు. వారి వద్ద నుండి పది కోడిపుంజులు, రూ.11వేలు నగదును స్వాధీనపరుచుకున్నారు. వీరిని శుక్రవారం కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఇంటిపై గంజాయి బ్యాచ్ దాడి

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన

ప్రజాశక్తి-తాడేపల్లి

పొట్టకూటి కోసం బట్టలమ్ముతూ చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న ఓ మహిళ ఇంటిపై గంజాయి బ్యాచ్ దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బాధితులు గురువారం ఉదయం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితులను అలా తీసుకొచ్చి పోలీసులు ఇలా వదిలిపెయ్యటం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్నంలోని రజక బజార్ సమీపంలో నివాసం ఉంటున్న వంగర అలివేలమ్మ ఇంటిపై సమీపంలో ఉన్న గంజాయి సేవించటానికి అలవాటు పడ్డ కొల్లూరి పవన్, అనిల్ దాడికి పాల్పడ్డారు. ఇంటి మీద కెళ్ళి గేటు పగలగొట్టారు. మంచినీటి మోటారు పంపుకున్న పైపులైన్ విరగొట్టారు. ఇంట్లో ఉన్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. భయాందోళనలకు గురైన బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుల్లో అనిల్‌ని తీసుకొచ్చిన పోలీసులు వెంటనే వదిలివేయడంతో అతడు, అతని కుటుంబసభ్యులు బాధితురాలి ఇంటికి వెళ్లి ఇబ్బందికి గురిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్సై జె ఎస్ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీలో ధూళిపాళ్ల పుట్టనరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో స్థానిక పొన్నూరు నియోజక వర్గ శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ధూళిపాళ్ల పుట్టిన రోజు కాగా గురువారం ముందస్తు వేడుకలను ఎ.ఎన్.యు.లోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేశాయి. విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద భారీ కేకును కట్ చేసి విశ్వవిద్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కాకుమానులో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి, పెదనందిపాడు

సుస్థిర ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని విస్తరణాధికారి రవి బాబు తెలిపారు. కాకుమాను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు రెండు రోజులు మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలహిత గ్రామం, వంటి పలు అంశాల గూర్చి శిక్షణ అందజేశారు. కార్యక్రమం లో జడ్పీటీసీ గుల్జార్ బేగం, ఈవోపీఆర్డీ చేబ్రోలు రవిబాబు, పంచాయతీ కార్యదర్శి ఏ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



ముగిసిన నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : జిల్లా నెట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల నెట్ బాల్ జట్లు ఎంపిక ముగిసింది. గురువారం స్థానిక చెంచుపేట ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపికలో పలు ప్రాంతాల నుండి వందమంది క్రీడాకారు లు పాల్గొన్నట్లు జిల్లా నెట్ బాల్ సంఘ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 2025 జనవరి 21 22 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు జయ సుధాకర్, డి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవ, సర్దార్, ఎఎంజి రాజు, కుమారి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర దక్కక వరి రైతులకు రూ.60 కోట్ల నష్టం



- తేమశాతం పేరుతో ధర దిగ్గోత
- పత్తిలోనూ ఎకరాకు రూ.10-20 వేల నష్టం
- మద్దతు ధరల కోసం మిర్చి రైతుల నిరీక్షణ
- పంటలన్నింటినీ నిబంధనలు సడలించి మద్దతు ధరకు కొనాలని కౌలురైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అన్ని పంటలనూ ఎటువంటి నిబంధనలూ లేకుండా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన జారీ చేశారు. పంటలకు మద్దతు ధరలిస్తే రైతులు బాగుంటారని, పంటలనూ ఉత్సాహంగా సాగు చేస్తారని, కొనుగోలు శక్తి పెరిగిఅన్ని రంగాలూ అభివృద్ధి బాటలో ఉంటాయని పేర్కొన్నారు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.7521 ప్రకటించినా తేమ శాతం ఎక్కువ ఉందని నాణ్యత తక్కువ ఉందని వంకలు చెప్పడంతో రైతులకు సిపిఐ కొనుగోలు కేంద్రాల్లో అసలు ధర దక్కడం లేదని తెలిపారు. దీంతోపాటు రైతుల కంటే దళారులకే ప్రాదాన్యమిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కాకుండా జిన్నింగ్ మిల్లులవద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, రైతుల నుండి వచ్చిన సరుకుని సకాలంలో కొనుగోలు చేయకపోవడం తదితర ఇబ్బందుల వల్ల రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. రూ.5500 నుండి రూ.6500కే పత్తిపంట అమ్ముకోవడం ద్వారా ఎకరాకు రూ.10-20 వేల వరకు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం వరిపంట నూర్పిడి దశలో ఉన్నా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలేమీ ప్రభుత్వం జారీ చేయలేదని పేర్కొన్నారు. కొనుగోళ్లకు సంబంధించి లక్ష్యం కూడా మొక్కుబడిగా ఉన్నాయని, నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. గోతాలు ఎక్కడా రైతులకు అందుబాటులో లేవని, రాయితీపై కొత్త గోతాలు అందుబాటులో ఉంచాలని కోరారు. పల్నాడు జిల్లాలో 2 లక్షల టన్నులు ధాన్యం దిగుబడికి అవకాశం ఉండగా ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం 5 వేల టన్నులేనని, మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1725 ఉన్నా బహిరంగ మార్కెట్‌లో రూ.1300-1400కు మించి కొనడం లేదని తెలిపారు. రైతుల నుండి వచ్చిన సరుకు కంటే దళారుల ద్వారా వచ్చిన సరుకు కొనుగోలుకే మిల్లర్లు ప్రాధాన్యమిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కాటా కూలీలను కూడా రైతుల దగ్గరకు వెళ్లనీయకుండా దళారులే అడ్డుకుంటున్నారని తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో పరీక్షించిన తేమశాతం కంటే మిల్లుల్లో 3 నుండి 5 శాతం అదనంగా చూపిస్తున్నాయని, ఒక్కో పాయింట్ శాతానికి రూ.20 ధరకోత విధిస్తున్నారని విమర్శించారు. రవాణా ఛార్జీలు, గోతాల కొనుగోళ్లు, హమాలీ ఛార్జీలు ఇవేవి అమలు కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారి, కనీస మద్దతు ధర దక్కక పల్నాడు జిల్లాలో వరి రైతులు రూ.60 కోట్ల వరకు నష్టపోతున్నారని వివరించారు. కౌలు రైతులు మరింతగా నష్టపోయి, అప్పులపాలవుతారని పేర్కొన్నారు.

మిర్చి పంట మరి కొద్ది రోజుల్లో మార్కెట్‌లోకి వస్తుందని, ప్రభుత్వం కనీస మద్దతు ధర ఎప్పుడు ప్రకటిస్తుందా? అని రైతులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. గతం కంటే 50 శాతం ధరలు పడిపోయాయని, గతేడాది నుండి మిర్చి ధరలు తగ్గుముఖం పట్టడంతో చాలామంది రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశారని తెలిపారు. పెరిగిన పెట్టుబడులు, చీడ పీడల బెడద, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని కష్ట నష్టాలకు గురైన రైతులకు మద్దతు ధర దక్కక పోవడంతో వారు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. కనీస మద్దతు ధరను రూ.15 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. యార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, దుర్గిలో ప్రస్తుతం తాత్కాలిక మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని, ఎగుమతులకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు.

విద్యుత్ భారాలపై బిల్లుల దహనంతో నిరసన

ప్రజలకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం దుర్మార్గమైన చర్యని, ఈ భారాలను నిరసిస్తూ ప్రజలు ఎక్కడికక్కడ విద్యుత్ బిల్లులను దహనం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ పిలుపునిచ్చారు. ఆదాని విద్యుత్ కొనుగోళ్ల అవినీతి అక్రమాలపై సిపిఎం శ్రేణులు మండలంలోని రెంటపాళ్లలో గురువారం ప్రచారం చేపట్టాయి. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికల సమయంలో ప్రజలకు చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత బాదుడుకు దిగారని విమర్శించారు. ట్రూ అప్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఆ పని చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపితే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు పవన్ కల్యాణ్ లు వ్యతిరేకించారని గుర్తు చేశారు. భారాలను ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.పూర్ణచంద్రరావు, వి.తులసిరామ్ జె.భగత్, బి.రామారావు, సిహెచ్ లక్ష్మీనారాయణ, డి.మేరమ్మ, డి.సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదానీ కంపెనీల అవినీతి, విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.



ప్రచారంలో భాగంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరికపూడిసెలపై మార్చిలో స్పష్టత

- ప్రాజెక్టును పూర్తి చేయలేకుంటే రాజకీయాల నుండి నిష్క్రమణ
- మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అవినీతి, అక్రమాలపై విచారణ జరుపుతాం
ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల

పల్నాడు ప్రజల దశాబ్దాల కలైన వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేయలేకపోతే రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్ టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రతి ఎన్నికల సమయంలో వరికిపూడిసెల ప్రాజెక్టు పూర్తి చేస్తానని, చేయలేకపోతే ఎన్నికల్లో పోటీచేయనని తప్పుడు వాగ్దానాలు చేసి నాలుగుసార్లు గెలిచారన్నారు. ప్రాజెక్టు పూర్తిచేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అటవిశాఖ వారు మొక్కలు పెంచటానికి నష్టపరిహారంగా రూ.14 కోట్లు విడుదల చేసిందని, ప్రాజెక్టు నిర్మాణంపై మార్చిలో పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. గత ఐదేళ్ళలో రైతులకు ఏమీ చేయని పిన్నెల్లి ఈ రోజున రైతులు గురించి మట్లాడుతున్నారని అన్నారు. జెర్రివాగు లిఫ్ట్ఇరిగేషన్‌ను తన తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పూర్తి చేసిన ప్రాజెక్టును పిన్నెల్లి హయాంలో మూలనపడేశారని విమర్శించారు. కమీషన్ల కోసం ధర్మవరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులను చేపట్టలేదని,



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పేటసన్నిగండ్ల లిఫ్ట్‌ను కూడా మూలనపడేశారని దుయ్యబట్టారు. కనీసం ఫిల్టర్ బెడ్‌లు మార్చలేదని, మాచర్ల మున్సిపాల్టీని అప్పుల్లో ముంచారని మండిపడ్డారు. విద్యుత్ బిల్లులు రూ.7 కోట్లు, పరికాలు రూ.2 కోట్లు అప్పులు మిగిలిచ్చారని, మున్సిపల్ వర్కర్లను పిన్నెల్లి సోదరుల ఇళ్లలో పనులు చేయటానికి పెట్టుకున్నారని, ఇద్దరు సోదరులు, వారి అనుచరుల వాహనాలకు మున్సిపాలిటీ కింద డీజిల్ వాడుకునేవారని ఆరోపించారు.

పిన్నెల్లి అవినీతి, అక్రమాలుపై విచారణ

ప్రభుత్వ భూములను పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కబ్జా చేయటమే కాకుండా రైతులును బెదిరించి భూములు లాక్కున్నారన్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. నిమ్మగడ్డ రవికృష్ణపేరుతో రూ.20 కోట్లు దోచుకున్నారని, మాచర్ల మండలంలోని ఎయిర్‌పోర్టు వద్ద రైతుల భూములను లాక్కున్నారని, అసైన్డ భూములు, దేవాదాయశాఖ భూములను తమ బినామీ పేర్లతో దోచుకున్నాడన్నారని, బైపాస్ రోడ్డులో భూముల నష్టపరిహారాన్ని పొందారని, పట్టణంలోని విలువైన పిడబ్ల్యూడీ కాలనీ భూముల్లో అనర్హులైన అతని అనుచరులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని దొంగపాస్‌బుక్‌లతో బ్యాంకుల్లో లోన్లు తీసుకున్నారని ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు ఆయన పార్టీ నాయకులు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావని, వీటన్నిటీ పై విచారణ జరిపి తీరుతామని స్పష్టం చేశారు. పిన్నెల్లి అవినీతిపై చర్చకూ సిద్ధమని సవాల్ విసిరారు.



పీఆర్సీ అమలు కోసం మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 2023 నవంబర్, డిసెంబర్‌లో పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స వెంటనే విడుదల చేయాలని కోరారు. పండగ సెలవులు, క్యాజువల్ లీవులు వర్తింపజేయాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, వారి స్థానంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, టిఎల్‌ఎఫ్ కింద తీసుకున్న కార్మికులను, ఎన్ఎంఆర్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి రూ.21 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, సంక్రాంతి కానుక రూ.వెయ్యి అమలు చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ సబ్బులు, చెప్పులు, నూనెలు ఇవ్వాలనానరు. వినతిపత్రం అందించిన వారిలో కార్మికులు ఎం.ప్రతాప్, కె.యలమంద, కె.విజయ్, సురేష్, పద్మ, శ్యామ్, కోటి ఉన్నారు.



నీటి సంఘాల ఏకగ్రీవాలకు కృషి చేయండి

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు శనివారం నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఏవో వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు నియమించిన పోలింగ్ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణిచ్చారు. ఎన్నికల అధికారులను నియమించామని, వారికి తోడు పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు. వీలైనంతవరకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. క్రోసూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు ఉంటాయని, బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించాలని చెప్పారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల



మండలంలో జరిగే సాగునీటి సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు మండల తహశీల్దార్ భవానీశంకర్ గురువారం తెలిపారు. సహాయ ఎన్నికల అధికారులుగా గ్రామ రెవెన్యూ అధికారులను, పోలింగ్ సహాయ పోలింగ్ అధికారులుగా సచివాలయ సిబ్బందిని నియమించామని చెప్పారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నీటి తీరువా చెల్లించి, ఎలాంటి బకాయిలూ లేవని ధ్రువపత్రం తీసుకోవాలని, నామినేషన్ సమయంలో ఆ పత్రాన్ని సమర్పించాలని చెప్పారు. శనివారం ఉదయం 8గంటలకు సాధారణ సర్వసభ్య మండలి సమావేశం ప్రారంభమవుతుందని, రైతులు పట్టారుపాసు పుస్తకము, అడంగలు కాపీలతో పాటు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

ఆదర్శ ప్రజాప్రతినిధి నిమ్మగడ్డ రామ్మోహనరావు



మంగళగిరి బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మాజీ ఎమ్మెల్యే, సిపిఎం జిల్లా నాయకులు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకుపోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహన్రావు 16వ వర్ధంతి సందర్భంగా గురువారం రాత్రి మంగళగిరి మండల పరిషత్ గేట్ ఎదురుగా ఉన్న నిమ్మగడ్డ విగ్రహం వద్ద సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మంగళగిరి నియోజకవర్గంలోనూ, సమితి పరిధిలోను ఉన్న అన్ని గ్రామాలలో ప్రజాప్రతినిధిగా అనేక పాఠశాలలను, లిఫ్ట్ ఇరిగేషన్లను తీసుకొచ్చిన ఘనత ఆయనదేనని అన్నారు. నిరంతరం ప్రజలలో ఉండి ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడు నిమ్మగడ్డ అన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ల రాజకీయం నడుస్తుందని అన్నారు. వేల కోట్ల రూపాయలు ఉన్నవారు ఎంపీగా పోటీ చేసి గెలుస్తున్నారని, వందల కోట్ల రూపాయలు ఉన్నవారు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తున్నారని అన్నారు. గెలిచిన తర్వాత ప్రజల గురించి పట్టించుకునే ప్రజాప్రతినిధులే ప్రస్తుతం లేరని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు డీజిల్ ధరలు పెంచుతున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో 63 స్థానాలు తగ్గినప్పటికీ దూకుడు మాత్రం తగ్గలేదని అన్నారు. కేవలం టిడిపి, జేడీయు పార్టీలపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం ఉందని అన్నారు. జెమిలి ఎన్నికల వలన రాష్ట్రాలు ఉన్న హక్కులు హరించుకు పోతాయని అన్నారు. దేశంలో నియంతృత్వ పాలన తీసుకొచ్చేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జెమిలి ఎన్నికల విధానాన్ని తీసుకొస్తుందని విమర్శించారు. కేంద్ర క్యాబినెట్ కూడా ఆమోదించడం జరిగిందని అన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకించాలని అన్నారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ ఎన్నికలను తీసుకువస్తున్నారని విమర్శించారు. ఆదాని కుంభకోణం పై భారతదేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై ఐదు నెలలోనే అనేక భారాలు మోపిందని విమర్శించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం చేయడం లేదని విమర్శించారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా 40,000 మంది వివిధ రకాల భూముల్లో ఇల్లు వేసుకొని నివాసం ఉన్నవారికి 20,000 మందికి పట్టాలు వచ్చాయని అన్నారు. మిగిలిన 20,000 మందికి లోకేష్ అధికారంలోకి వస్తే వెంటనే పట్టాలిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. కానీ ఇంతవరకు అమలకు పూనుకోవడం లేదని విమర్శించారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ కు రూ. 4కోట్లు మంజూరు చేస్తే 25000 ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. గుంటూరు ఛానల్ కు రూ. 300 కోట్లు విడుదల చేస్తే 50 గ్రామాలకు సాగు, తాగునీరు అందుతాయని అన్నారు. కానీ ఆ నిధులు విడుదల చేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం ముందుకు రావడంలేదని విమర్శించారు. గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో అనేకమంది త్యాగాల ఫలితంగా పేద ప్రజల సమస్యలను పరిష్కరించడం జరిగిందని అన్నారు. నిమ్మగడ్డ రామ్మోహన్ రావు ఎమ్మెల్యేగా ఈ ప్రాంతంలో రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారని అన్నారు. సభలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం జిల్లా నాయకులు డి వెంకటరెడ్డి, బి కోటేశ్వరి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు డి శ్రీనివాస కుమారి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి పి కృష్ణ, మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి యు దుర్గారావు, సిపిఎం సీనియర్ నాయకులు ఎం పకీరయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు జగన్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. తొలుత నిమ్మగడ్డ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఘన నివాళులర్పించిన సిపిఎం, ప్రజాసంఘాలు



ఆత్మకూరులో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఆత్మకూరులో రైతు సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే శ్రీనిమ్మగడ్డ రామ్మోహన రావు వర్ధంతి సందర్భంగా రామ్మోహన్ రావు విగ్రహానికి సిపిఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, శాఖ సహాయ కార్యదర్శి బిట్రా రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జనార్ధన రావు సీతారామాంజనేయులు శర్మ రామారావు సుబ్రహ్మణ్యం మునగాల శ్రీను మహిళా సంఘం నాయకులు లక్ష్మి సుజాత శకుంతల శివమ్మ పాల్గొన్నారు.



కృష్ణాయపాలెంలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : నిమ్మగడ్డ రామ్మోహనరావు స్వగ్రామం కృష్ణాయపాలెంలో ఆయన విగ్రహానికి సిపిఎం రాజధాని డివిజన్ నేతలు, ఆయన కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించి ప్రజా సేవకే అంకితమైన ధన్యజీవి నిమ్మగడ్డ అని చెప్పారు. నిజాయితీగా, నిస్వార్థ ప్రజా సేవకుడిగా, పేదలకు, రైతులకు, కార్మికులకు కొండంత అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ రామ్మోహన రావు సతీమణి శ్రీమతి లక్ష్మీ సామ్రాజ్యం, సోదరుడు నిమ్మగడ్డ మురళీకృష్ణ, కుమారులు నిమ్మగడ్డ బాల ప్రకాష్ , దినకర్ , కొరటాల రాంబాబు, సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు, ఎస్ రామరాజు, షేక్ జానీ, అత్తలూరి వీర వెంకయ్య గైరబోయిన నాగేశ్వర రావు, నండూరి శ్రీరామ మూర్తి, ఎల్ రాధిక పాల్గొన్నారు.



గుంటూరు లో

ప్రజాశక్తి-గుంటూరు : ఆదర్శ ప్రజాప్రతినిధి, రైతు నాయకుడు నిమ్మగడ్డ రామ్మోహనరావు ఆశయా లను, లక్ష్యాలను కొనసాగించాలని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో రామ్మోహనరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా నాయకులు కె.అజయ్‌కుమార్, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రామ్మోహనరావు మంగళగిరి ఎమ్మెల్యేగా, సమితి అధ్యక్షునిగా, మండల ప్రజాపరిషత్ అధ్యక్షునిగా పనిచేసి నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. మంగళగిరి ప్రాంతంలో రైతాంగానికి ఉపయోగపడే కృష్ణాయపాలెం, కాజ గ్రామాలలో ఎత్తిపోతల పథకాలకు నిధులు సాధించి, వేలాది ఎకరాలకు నీరందించేందుకు కృషిచేశారన్నారు. కొండవీటివాగు ముంపు నివారణకు సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి ప్రభుత్వానికి అందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలాన్నరు. కార్య క్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, నగర కార్యదర్శి కె.నళినికాంత్, నాయకులు బి.శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, ఎమ్.ఎ.చిష్టీ, బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డిఎల్‌పిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయ తీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై గుంటూరు రూరల్ మండలంలో అధికారులకు, సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందితో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎండిఒ బండి శ్రీనివాసరావు అధ్యక్షతన శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ శిక్షణలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణ ఆవశ్యకత పేదరికం లేని మెరుగైన జీవనోపాదులు, ఆరోగ్యవంతమైన, బాలహిత, సమృద్ధిగా నీరు కలిగి ఉన్న, పచ్చదనం పరిశుభ్రత తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు, ఎపిఎస్ఐఆర్‌డి నుండి మోహనరావు, విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.




ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఆరోగ్యకేంద్రంలో అడిషనల్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

నల్లపాడు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ఎస్ అనిల్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో వ్యాక్సిన్స్, కోల్డ్ చైన్ సిస్టం, ఒ. పి, మందుల విభాగము, ల్యాబ్ పరీక్షలు మొదలైనవి పరిశీలించారు. సురక్షిత ప్రసవ క్యాలెండర్, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో పలు సూచనలు చేశారు. తదుపరి ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ శిక్షణ కార్యాలయం ఎల్‌హెచ్‌వి శిక్షణ పొందుతున్న మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణలో పాల్గొని మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో అమలవుతున్న, నూతనంగా ప్రవేశపెట్టిన వివిధ కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య శాఖలో వినియోగిస్తున్న ఆన్లైన్ యాప్‌లు, పోర్టల్స్ పై సవివరంగా శిక్షకులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణాకేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జ్యోత్స్న, స్టేట్ కోఆర్డినేటర్ సి.ఎల్.రాజు, పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.కృష్ణప్రభ, శిక్షణ కోఆర్డినేటర్ జి.రేణుక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పద్మిని

ఆరోగ్య సమస్యలపై హిందూ ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

గర్భాశయ కాన్సర్ నుండి రక్షణ పొందటానికి హ్యూమన్ పాపిల్లోమా వ్యాక్సిన్ తీసుకోవాలని డాక్టర్ పద్మిని అన్నారు.స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో సాధారణ స్త్రీ ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ/చికిత్సలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిధిగా విచ్చేసిన గుంటూరులోని విజయశ్రీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మిని పాల్గొని మాట్లాడుతూ సాధారణంగా స్త్రీలు ఎదుర్కొనే రుతుక్రమ సమస్యలు, రక్తహీనత (ఎనీమియా), పిసిఒఎస్, ఎండోమెట్రియాసిస్, ప్రెగ్నెన్సీ, మేనోపాజ్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వేవల్ క్యాన్సర్ మొదలైన సమస్యలకు గల కారణాలు, లక్షణాలు, వాటి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలను గురించి తెలియచేశారు.అనంతరం కళాశాల యాజమాన్యం డాక్టర్ పద్మినిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-గుంటూరు

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక టిజెపిఎస్ కాలేజిలో సైబర్ సెక్యూరిటీ, డ్రగ్ అబ్యూస్, ఈవిటీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి అధ్యక్షతన నిర్వహించారు. సైబర్ సెల్ ప్రతినిధులు హాజరై సోషల్ మీడియా క్రైమ్స్, ఫైనాన్షియల్ క్రైమ్స్ గురించి బాధితులు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్‌చేసి సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టాభిపురం పోలీసు స్టేషన్ ఎస్ఐ డి.ఆంజనేయులు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల వినియోగం, రవాణా లాంటి నేరాలకు పాల్పడి ఒక్కసారి ఎఫ్ఐఆర్ నమోదు అయితే జీవితంలో ఎలాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకూ ఎంపిక కాలేరని, భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. కావున యువత మంచి నడవడికతో ఉండాలన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ కె.శ్రీధర్‌బాబు, స్టెప్ మేనేజర్ బి.రాధిక, తన్నీరు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలని సిపిఎం విస్తృత ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న నాయకులు



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సిపియం నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతూ స్వర్ణాంధ్ర నిర్మాణం అని చెప్పటం హాస్యాస్పదమని సిపిఎం నగర కమిటీ సభ్యులు టి.శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరశిస్తూ గురువారం సంగడిగుంట ప్రాంతంలోని బావాజీ నగర్లో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, నారా లోకేష్ విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీనిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ ఆఫ్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో రూ.17 వేల కోట్లు భారాన్ని ప్రజలపై వేశారని అన్నారు. విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రషీద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలను, ట్రూ ఆప్ పేరుతో విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని సిపియం నెహ్రూ నగర్ శాఖ కార్యదర్శి టి.రాధ అన్నారు. విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ గురువారం వెంకటాద్రిపేటలో పార్టీ కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.శ్రీనివాసరావు, ఒ.రోజమ్మా, ఫాతిమా, మరియమ్మ, కరుణ, ఎస్తేరు, ప్రభావతి పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం తన నివాసంలో అందజేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల 24 వేల 443 మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సంబంధిత సమస్యలతో ఆసుపత్రుల్లో చేరి, బిల్లులు చెల్లించలేని నిరుపేదలకు సీఎం సహాయనిధి అడగా నిలుస్తోందని చెప్పారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఊడిజర్ల గ్రామంలో రేషన్ దుకాణం, 23, గోపువారిపాలెం గ్రామంలో రేషన్ దుకాణం 28లో సీఎస్‌డీటీ విద్యాసాగర్ గురువారం తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లను పరిశీలించి బియ్యం, కందిపప్పు పంచదార నిల్వల్లోని వ్యత్యాసాలను పరిశీలించారు. అన్నీ సక్రమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో మరియదాసు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాచర్ల రోటరీ క్లబ్ సభ్యులు అన్నారు. గురువారం హరితోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌కెబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి, డాక్టర్ రామకోటయ్య, పల్నాడు కాలేజీ ప్రిన్సిపాల్ శివ భాస్కర్, ఆవుల అంజి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.





బాస్కెట్ బాల్ పోటీల్లో సత్తా చాటిన 'ధనలక్ష్మి' విద్యార్థినులు

ప్రజాశక్తి-ఈపూరు

యూనివర్సిటీ ఆర్ట్స్ కామర్స్ లా కాలేజ్ ఆధ్వర్యంలో జరిగిన అంతర కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలలో మండలంలోని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థినులు ఐ.తిరుపతమ్మ, వి.వెంకటలక్ష్మి ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు తెలిపారు. వీరు ఈ నెల 20వ తేదీ నుంచి ఎంజీ యూనివర్సిటీ కొట్టాయంలో జరిగే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విద్యార్థినులను కళాశాల కార్యదర్శి, కరెస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, ఎం.దాసు, కె.వంశీ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి కళాశాలకు పేరుప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతం నుంచి మరింత మంది క్రీడాకారిణులు రావాలన్నారు.

సుస్థిర లక్ష్యాలతో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి - క్రోసూరు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో గ్రామాలను అభివృద్ధిపరిచి గ్రామీణ వికాస సమాజ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో తమ వంతు కృషి చేయాలని బాపట్ల ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వెంకటరావు అన్నారు. క్రోసూరులోని మండల ప్రజా పరిషత్ సమావేశమందిరంలో స్థానికీకరణ- సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పెరుమాళ్ల కోటయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వనరుల వినియోగంతో జీవన ప్రమాణాల పెంపు

సత్తెనపల్లి రూరల్ : మానవ వనరులు వినియోగించుకోవడం ద్వారా జీవన ప్రమాణాలు పెంపొందుతాయని బాపట్ల శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్, రాష్ట్ర పరిశీలకులు డి.వెంకటరావు అన్నారు. సత్తెనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగు అసిస్టెంట్లు , ఏఎన్ఎంలు, వ్యవసాయ ఉద్యానవన సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సుస్థిరతాభివృద్ధి లక్ష్యాల సాధనకు శిక్షణ కార్యక్రమం ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డి ఎ.శ్రీనివాసరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ భావన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయంలో...

అచ్చంపేట: వచ్చే ఆర్థిక సంవత్సరానికి స్థానికీకరణ-సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులకు శిక్షణా తరగతులు ఇస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న కార్యక్రమంలో ఆయన పలు అంశాలపై వివరించారు. పంచాయతీ కార్యదర్శి పంతులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పెదకూరపాడు: ప్రజల జీవనోపాధి లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల జీవనోపాధి పెంచేందుకు ఈ శిక్షణ చేపట్టామన్నారు. దీనిపై అవగాహన పెంచుకొని గ్రామాలలో ఆచరించాలని కోరారు.



అచ్చంపేటలో అధికారులకు అవగాహన



పెదకూరపాడులో శిక్షణ కార్యక్రమం

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలంలోని అందుకూరు, బాలెమర్రు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఎనిమిది అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన ఈ సదస్సులను రైతులంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ జగదీశ్‌రెడ్డి, పిల్లి శ్రీధర్, వీఆర్వో కోటయ్య, నాయకులు దిగుమర్తి అప్పారావు, సర్పంచ్ తాళ్లూరి వాసు, వాసిరెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తాడువాయి గ్రామంలో 120 వినతులు

ప్రజాశక్తి - అచ్చంపేట

తాడువాయి గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 120 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు కె.శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కొందరు అర్జీదారులకు పాస్ పుస్తకం మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.





వినతులు స్వీకరిస్తున్న అధికారులు



ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం స్టేషన్ రోడ్డులోని పెన్షనర్ అసోసియేషన్ సంఘ భవనంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను సంఘం ప్రెసిడెంట్ మానవ సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.ఎం.విక్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఇతరుల పట్ల ప్రేమ, జాలి, దయ, కరుణ చూపాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు రంగనాయకులు, కార్యదర్శి ఆదయ్య, కోశాధికారి ఎస్ఆర్‌కె ప్రసాద్, పి.నాగభూషణం, రాజేశ్వరరావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లు.. సాకారమయ్యేదెప్పుడు?

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గుంతలు లేని రోడ్లను ఏర్పాటు చేస్తామంటూ కూటమి నాయకులు పల్లెపండుగ పేరిట చేసిన హడావిడి అంతాఇంతా కాదు. ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించి హంగామా చేశారు. చిలకలూరిపేట నుంచి గణపవరం నాదెండ్ల డొంక రోడ్డుతో పాటు.. పలు గ్రామాల్లో రోడ్లు గుంతల మయంగా మారి రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వాహన చోదకులు, స్థానికులు వాపోతున్నారు. ఏ.ఎం.జి పక్కనే ఉన్న శివప్రియ నగర్ పెట్రోల్ బంకు నుంచి గణపవరం, నాదెండ్ల మీదుగా జంగాలపల్లె వరకూ ఆర్అండ్‌బీ అధికారులు రూ.40 లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. పెట్రోలు బంకు వద్ద జంగాలపల్లె, సంకురాత్రి పాడు గ్రామాల్లో తప్ప మిగిలిన చోట్ల ప్యాచ్ వర్క్ నిర్వహించకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై కూటమి నాయకులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



ఏఎంజీ నుంచి నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డు మార్గంలో ఏర్పడిన గోతులు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

కళ్ల వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సర్వేంద్రియానం నయనం ప్రధానమని.. అటువంటి కళ్ల పట్ల ప్రతి ఒక్కరూ ఎంతో జాగ్రత్తగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి తౌషీద్ హుసేన్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ అన్నారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్ల ప్రాధాన్యత గుర్తించి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్‌కుమార్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ కొరడా

➤రూ.6.65 లక్షల అపరాధ రుసుం విధింపు

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. సీఆర్‌డీఏ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, గుంటూరు టౌన్ 2 డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టాయి. మండలంలోని 16 గ్రామాలలో 60 మంది సిబ్బంది 30 బృందాలుగా విడిపోయి మొత్తం 2,188 సర్వీసులను తనిఖీ చేశారు. 98 సర్వీసులకు ఓవర్‌లోడు కింద రూ. 5, 13, 500 అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యాన్ని గుర్తించి మూడు సర్వీసులకు రూ.1.50 లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం 102 సర్వీసులపై కేసులు నమోదు చేసి, రూ 6.65 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు సూపరింటెండెంట్ ఇంజినీరు పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ తనిఖీలలో గుంటూరు రూరల్ ఏడీఈ గురునాథం, చిలకలూరిపేట ఏడీఈ ఆర్.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చినకాకాని గ్రామ పరిధిలో ఇండస్ట్రీ ఏరియా వైపు వెళ్లేందుకు నూతన బైపాస్‌ను దాటేందుకు అండర్ పాస్ నిర్మించాలని నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ అధికారులకు పలువురు రైతులు గురువారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీ వద్ద గల కార్యాలయంలో అధికారులను రైతు సంఘం నాయకులు గైరుబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజ్, బాబు తదితరులు కలిసి సమస్యను వివరించారు.

బాలికల సంరక్షణ బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి- చేబ్రోలు

ఆడపిల్లల సంరక్షణ బాధ్యత అందరిదీ అని మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణి కె.లలిత అన్నారు. కిశోరీ వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పొన్నూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కౌమారదశ బాలికల విషయంలో శ్రద్ధ వహించాలని చెప్పారు. వారి ఆరోగ్యం, పోషణ, రక్షణ, విద్య , సాధికారత మెరుగుపడే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. లింగ వివక్షత లేని స్వచ్ఛమైన సమాజ వాతావరణ కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రేమలత, ప్రత్యేక విద్య ఉపాధ్యాయురాలు ఎన్.విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, ఏపీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై గురువారం రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం పెదనందిపాడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవి మాట్లాడారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పెదనందిపాడు ఎంపీపీ తమలపాకుల హెప్సీబా, ఈఓపిఆర్డీ వరూధిని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందేదెప్పుడో?

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి వేతన బకాయిలు ఉండిపోయాయి. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచీ వారికి చెల్లింపులు కాలేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 80 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఉదయం 6కి పాఠశాలకు వచ్చి సాయంత్రం నాలుగు గంటల వరకు సుమారు నాలుగు సార్లు మరుగుదొడ్లను శుభ్రం చేయడం వీరి విధి. పాఠశాలల పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా చేస్తుంటారు. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున వేతనం గత ప్రభుత్వం చెల్లించేది. 2021 ఫిబ్రవరి నుంచి వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. గత ప్రభుత్వంలో రెండు నెలలకోసారి అయినా వేతనాలు చెల్లించే వారిని కార్మికులు చెబుతున్నారు. చాలీచాలని వేతనాలతో తమ జీవనం కొనసాగిస్తున్నామని.. ఆరు నెలల నుంచి ఆ మొత్తం కూడా రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం వడ్డీలకు అప్పు తెచ్చుకొని జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణకు పారిశుధ్య కార్మికుల సేవలు కీలకం. వారు సమ్మెలోకి వెళితే పాఠశాల వాతావరణమంతా అధ్వానంగా తయారయ్యే ప్రమాదం ఉంది. విద్యార్థులకు కూడా ఇబ్బందులు తప్పవు. విద్యాశాఖ మంత్రిగా మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఉన్నారని.. ఆయన జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.



ఓ పాఠశాలలో మరుగుదొడ్లు

సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

భూసమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను తలపెట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లి మండల ఉప తహసీల్దార్ ఎస్ఎం రిజ్వాన్ అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతులు తమ పంట భూముల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని చెప్పారు. తమ భూములు అడంగల్‌లో నమోదు కాలేదని, తప్పులను సరిచేయాలని పలువురు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల సర్వేయర్ రవితేజ, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సిపిఎం కుంచనపల్లి గ్రామ ఒకటవ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు మేకల రాజా, బిరుదు గడ్డ రమేష్, దాసెట్టి అరుణ, రైతు భరోసా కేంద్రం అధికారిణి వల్లభనేని శిరీష తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - కొల్లిపర

రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకు 45 రోజులలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు సిద్ధార్థ చెప్పారు. కొలిపర మండలంలోని దంతులూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూకు సంబంధించి రైతులు తొమ్మిది అర్జీలు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

ఉప్పలపాడు గ్రామంలో..

పెదనందిపాడు: పెదనందిపాడు మండలం ఉప్పలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు మండల తహసీల్దార్ పి.శంకర్ బాబు తెలిపారు. ఈ సదస్సులో మొత్తం ఆరు అర్జీలు వచ్చాయని చెప్పారు. గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను అవసరమైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాహితీ మోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, దేవాదాయ ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కుంచనపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీటీ రిజ్వాన్



కొల్లిపర :అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

చెత్త సేకరణలో సమయపాలన అవసరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వీధుల్లో చేపట్టే చెత్త సేకరణలో సమయపాలన అవసరమని పారిశుధ్య కార్మికులకు తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి తో కలసి 34వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. శానిటేషన్ పరిస్థితిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైద్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, సహాయ ఇంజినీరు బి.సునీల్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనుల నిర్వహణ : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని.. శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు మరింత బాధ్యతగా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం పట్ల శ్రద్ధ చూపాలని చెప్పారు. సుద్దపల్లిడొంక, ప్రగతినగర్, పొన్నూరు రోడ్, ఎల్‌ఆర్ కాలనీ, పట్నంబజార్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం పూర్తవ్వాలన్నారు. డ్రైన్ల మీద ఆక్రమణలు లేకుండా ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఎల్‌ఆర్ కాలనీలో డ్రైన్‌లో మురుగుపారుదల లేకుండా ఉండడం, వ్యర్థాలు నిలవడం గమనించి సంబంధిత శానిటరీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పారిశుధ్క్య నిర్వహణ సరిగా లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, సచివాలయ పరిధిలో కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. అనంతరం ఏటీ అగ్రహారం, రామనామక్షేత్రం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాకపోవడం వల్ల దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిసిపి సూరజ్‌కుమార్, డిఈఈలు నాగభూషణం, మధుసూదన్, శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు సాదిక్‌బాషా, రెహ్మాన్, కార్పొరేటర్లు మీరావలి, ఆబీద్ బాషా ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్



గర్భిణులు, శిశువుల ఆరోగ్య సంరక్షణకే 'కిల్కారీ'

ప్రజాశక్తి - చేబ్రోలు

గర్భిణులు, శిశువుల ఆరోగ్య సంరక్షణకే కిల్కారీ సేవలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజు తెలిపారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిల్కారీ సేవలపై శిక్షణ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ శైలజ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లకు కిల్కారీ మొబైల్ సేవలు, వినియోగం, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సేవలపై ఆశల ద్వారా గర్భిణులకు పూర్తిస్థాయిలో వివరించి, వినియోగించుకునేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగమల్లేశ్వరి, పీహెచ్ఎన్ ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ సైనిక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ (బ్రిగేడియర్) పి.వెంకటరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, మాజీ అధికారి మేజర్ చారి తెలిపారు. స్థానిక కొత్తపేట ఎన్జీవో కల్యాణ మండపంలో గురువారం మాజీ సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ 37వ వార్షిక సమావేశం నిర్వహించారు.సంఘ గౌరవ అధ్యక్షులు ఎస్ఎం సుభాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. మాజీ సైనికుల వివరాలను ఒక వెబ్‌సైట్‌లో పొందుపరచేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రస్తుతం జేసీవో పిల్లలు ఉపకార వేతనాలు పొందవచ్చని తెలిపారు. పెన్షన్లు మెడికల్ కార్డులు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు జి.బాబూరావు కోశాధికారి వీరబ్రహ్మం, కార్యదర్శి వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నదే భారతీయ రిజర్వు బ్యాంకు ముఖ్య ఉద్దేశమని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు తెనాలి శాఖ సహాయ మేనేజరు పి.వేణుగోపాల్ అన్నారు. గురువారం కొత్తపేట రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌బీఐ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్ షాప్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకు సేవలను విస్తరిస్తూ ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. తమకొచ్చే ఆదాయంలో కనీసం ఇరవై శాతం పొదుపు చేయడం నేర్చుకోవాలన్నారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖాతాదారులు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. మెప్మా సిఎంఓ జి.విజయకుమారి డిజిటల్ మోసాలపై వివరించారు.

నూతన గ్రామపంచాయతీగా విజయపురిసౌత్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్‌లోని అంతర్భాగమైన విజయపురిసౌత్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. గురువారం ఈ విషయాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు విజయపురిసౌత్‌ను ప్రత్యేకంగా పంచాయతీగా ఏర్పాటు చేశారన్నారు. పంచాయతీగా చేయాలని స్థానికులు దశాబ్దాలుగా కోరుతున్నారని తెలిపారు. స్వపరిపాలన లేకపోవడం వలన సాగర్ వాసులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దశాబ్దాలుగా అభివృద్ధి కి దూరంగా ఉన్న విజయపురిసౌత్ నూతన పంచాయితీగా ఏర్పాటుతో అభివృద్ధి బాట పడుతుందన్నారు. నూతన పంచాయితీ ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



సెమినార్‌కు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులతో ప్రొఫెసర్ ఎటి.రాజు

కొత్త రసాయన చర్యల ఆవిష్కరణ సాధ్యమే

విజ్ఞాన్స్ వర్సిటీ సదస్సులో ప్రొఫెసర్ ఎటి బిజు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్గానో క్యాటలిసిస్ ద్వారా అనేక కొత్త రసాయన చర్యలను అవిష్కరించడం సాధ్యమవుతుందని, అంతేకాకుండా ఇవి పరిశోధనలో పురాతన మార్గాలను తెరవగలవని ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ ఏటీ.బిజు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపోరరి విస్తాస్ ఇన్ అప్లైయింగ్ (ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ, ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల ఇంటర్నేషనల్ సెమినార్‌లో భాగంగా రెండో రోజు సెమినార్‌లో ప్రొఫెసర్ ఏటీ.బిజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్గానోక్యాటలిసిస్ అనేది ఒక ప్రత్యేకమైన రసాయన పద్ధతని, ఇది పరిశోధన, పరిశ్రమల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. వివిధ రసాయన మార్పిడులను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని, దీని ద్వారా ఔషధ సంశ్లేషణ వేగంగా, సమర్థంగా జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఇది కొత్త రకాల ఔషధాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ విధానంలో హానికరమైన లోహ క్యాటలిస్టులు అవసరం ఉండకపోవడం వల్ల ఇది పర్యావరణానికి అనుకూలమైన పద్ధతిగాను, అధిక నాణ్యత గల పాలిమర్ ఉత్పత్తికి దోహదపడతాయన్నారు. భోపాల్‌లోని ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ నితిన్ టీ.పాటిల్ మాట్లాడుతూ రసాయన శాస్త్రం పరిశోధనల్లో రోజురోజుకు వినూత్నంగా అభివృద్ధి చెందటంతోపాటు ఔషధ తయారీ, సేంద్రియ రసాయన శాస్త్రం, మెటీరియల్స్ సైన్స్, కేన్సర్, మధు మేహం, న్యూరోడిజెనరేటివ్ వ్యాధులకు సంబంధించి మందులను రూపొందించడంలో ఉపయోగ పడుతుందన్నారు. ఆహారంలో రుచిని, రంగును మెరుగుపరిచే రసాయనాలను తయారు చేయడంలో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ ఎస్.భాస్కర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ జీ.శేఖర్, ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టర్ సీ.రఘు, వివిధ దేశాల ప్రతినిధులు, విజ్ఞాన్స్ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సెయింట్ ఆన్స్ విద్యార్థినులకు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీలో విద్యార్థినులు జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పిజి విద్యార్థినులు ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య.టి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నులను అభినందించి, విద్యతోపాటు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరిరెడ్డి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ కె.సుస్మిత, పి.నాగమణి, జి.లక్ష్మీదేవమ్మలను అభినందించారు.



గెలుపొందిన విద్యార్థినులు

15న 'సోమేపల్లి సాహితీ సౌరభం' సదస్సు



ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాల్‌లో ఈనెల 15వ తేదీ ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో 'సోమేపల్లి సాహితీ సౌరభం' పేరుతో సాహిత్య కదంబం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం నాయకులు చలపాక ప్రకాష్, ఎస్ఎం సుభాని, సోమేపల్లి వశిష్ట ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30కు జరిగే తొలి సదస్సులో సోమేపల్లి వెంకటసుబ్బయ్య స్మారక సంచిక ఆవిష్కరణ, 11 గంటలకు సోమేపల్లి సాహిత్య సదస్సు, 12:15 నిమిషాలకు నానా రచనలు నానీలు ఆవిష్కరణ సభ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం నుండి 15వ జాతీయస్థాయి సోమేపల్లి సాహితీ పురస్కారాల సభలో రాత స్మరణీయులు పుస్తకావిష్కరణ ఉంటుందని, అనంతరం ఐదుగురు ప్రముఖ రచయితలకు పురస్కారాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ నాలుగు సభలలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సి.భవానీదేవి, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మితోపాటు పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొంటారని, నగరంలోని సాహిత్యాభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సరస్వతి, యడవల్లి భూములను రైతులకు తిరిగివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సరస్వతీ పవర్ ఇండస్ట్రీస్ ఏర్పాటు పేరిట రైతులనుండి తక్కువ ధరకు కొనుగోలు చేసిన భూములను, చిలకలూరిపేట మండలంలో మైనింగ్ కోసం యడవల్లి దళిత రైతుల నుండి బలవంతంగా సేకరించిన అసైన్డ్ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుని భూమి లేని పేదలకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు డిమాండ్ చేశారు. గురువారం నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. మాచవరం మండలంలో సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించడం హర్షణీయ మన్నారు. అదే తరహాలో చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామంలో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములను దళిత రైతులు మైనింగ్‌కి ఇచ్చేది లేదని ప్రతి ఘటించి నప్పటికీ 2013 భూసేకర ణ చట్ట ప్రకారం కూడా కాకుండా గత ప్రభుత్వం పేదలను భయభ్రాంతులకు గురి చేసి పరిహారం చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదలకు వచ్చిన కొద్దిపాటి పరిహారం గతంలో టిడిపి,ఆ తర్వాత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలకు చెందిన కీలక నాయకులుగా వ్యవహరిస్తున్న వ్యక్తి పేదలను మోసం చేసి డబ్బులు తీసుకోవడం జరిగిందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యపై వైసిపి హయాంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించగా కేసు నమోదు చేశారని, కేసు విచారణలో కూడా ఎటువంటి పురోగతి లేకుండా గత ప్రభుత్వం పోలీసు వ్యవస్థ గొంతు నొక్కి పట్టిందన్నారు. సాగు చేసుకుంటున్న భూములలో మైనింగ్ నిక్షేపాలు ఉన్నాయని ఇచ్చిన పరిహారం తీసుకొని భూములు విడిచిపెట్టాలని గతంలో టిడిపి, వైసిపి అనేక విధాలుగా రైతులపై వేధింపులకు పాల్పడిన సందర్భంగా మొదటి నుండి సిపిఎం యడవల్లి దళిత రైతులకు అండగా నిలబడి పోరాటాలు సాగించిందన్నారు. గ్రానైట్ నిక్షేపాలు పేరిట ఎంపి అవినాష్ రెడ్డి తన కుటుంబ సభ్యులకు కట్టబెట్టేందుకు వైసిపి కుట్రలు పన్నిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు పేదలు తమ గోడు చెప్పుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం సరస్వతి పవర్ ఇండస్ట్రీకి సేకరించిన అసైన్డ్ భూములకు ఒక న్యాయం అవినాష్ రెడ్డి బంధువులకు ఒక న్యాయం అన్నట్లుగా వ్యవహరించకుండా తక్షణమే మైనింగ్ కోసం తీసుకున్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకొని తిరిగి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఔషధ రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రజారోగ్యం కాపాడటం కోసం మూలికా వైద్యంలో విస్తృత పరిశోధనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కే. రత్నషీలా మణి సూచించారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్మెంట్ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రెక్టర్ రత్నషీలామణి మాట్లాడుతూ ఔషధాలు కనుగొనడంలో ఫార్మసిస్టులది కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వృత్తి పట్ల నిబద్ధత ఉండటంతో ప్రజారోగ్యం ఆమేరకు సంవృప్తికరంగా ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా విషతుల్యత లేని ఔషధాలను కనుగొనేందుకు విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. ఉదయం జరిగిన ప్లీనరీ సెషన్ లో ఆచార్య గురువాయూరప్పన్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణలో నూతన ఆవిష్కరణలు, క్యాన్సర్ రోగులు ఎదుర్కొనే ఇతర ఇబ్బందులను నివారించడానికి తాను చేసిన పరిశోధనలో సత్ఫలితాలు వస్తున్నాయని విద్యార్థులకు వివరించారు. హైదరాబాదులోని నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డీన్ ఆచార్య సిహెచ్. కృష్ణమోహన్ మాట్లాడుతూ తన పరిశోధనలో ప్రీ క్లినికల్ ల్యాబ్ అనుభవాలను వివరించారు. ఒక వైద్యుడు తప్పు చేస్తే ఒకరు, ఇద్దరు రోగులు మరణిస్తారు. అదే ఒక ఫార్మాసిస్టు వలన తప్పు జరిగితే కొన్ని వందల మంది ఇబ్బందులు పడతారని ఆయన స్ఫూర్తిదాయక సందేశాన్ని ఇచ్చారు. ఫార్మాసిస్టులు కనుగొనే ఔషధాలు సమాజ రుగ్మతలను ఎదుర్కొనే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండవ ,తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బిఓఎస్ చైర్మన్, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. విద్యాధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ. ప్రమీలరాణి తదితరులు మాట్లాడారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ పోస్టర్ ప్రజెంటేషన్లకు 137 మంది పాల్గొనగా రెండు రోజుల జాతీయ సదస్సులో వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.



పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

గాజాపై తక్షణమే కాల్పులు విరమించాలి

ప్రజాశక్తి-గుంటూరు

అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ కాండను వ్యతిరేకించి, పాలస్తీ నాకు సంఘీభావంగా నిలబ డాల్సిన బాధ్యతపై విద్యార్థి, యువతరంపై ఉందనికె. ఎల్.యూనివర్సిటీ ప్రొఫెసర్ బుడ్డిగ జమిందార్ అన్నారు. పిడిఎస్ఒ, ఎన్‌వైఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'పాలస్తీనా సంఘీభావ సభ' గురువారం అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కళ్యాణ మండపంలో పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జమిందార్ మాట్లాడుతూ పాలస్తీనా ఇజ్రాయిల్ వివాదం గతేడాది అక్టోబర్ 7న మొదలైంది కాదని, వందేళ్లకుపైగా సాగుతుందన్నారు. 1948 నుంచి ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉందన్నారు. 1947- 48 యుద్ధంలో 70 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని, ఇప్పుడు 2023 నుంచి 24 వరకు 45 వేలకు పైగా పాలస్తీనియన్లు మరణించారన్నారు. పశ్చిమ ఆసియాలో ఉన్న 48 శాతం ముడి చమురుపై ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌ను అమెరికా సృష్టించి, దానికి లక్షల కోట్లు కేటాయిస్తోందని అన్నారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్.జిలానీ మాట్లాడుతూ ప్రపంచం పెద్దన్నగా వ్యవహరిస్తున్న అమెరికా తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ఆయుధాలను ప్రపంచ దేశాలకు నిరంతరం సరఫరా చేస్తూ ప్రపంచంలో ఎప్పుడూ యుద్ధం ఉండేలా చేస్తుందన్నారు. పిడిఎస్ఒ, ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎ.సురేష్, ఎస్.కె.భాషా మాట్లాడుతూ ఆహారం, మంచినీళ్ళ, వైద్యం కూడా అందనీయకుండా పాలస్తీనా ప్రజలను చుట్టుముట్టి ఇజ్రాయిల్ అత్యంత దుర్మార్గంగా దాడులు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సి.విజయ, జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు దివకుమార్, పిడిఎస్ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడారు. సభలో తొలుత 'ఉరికం సాక్షిగా' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభానంతరం అరండల్ పేట నుండి శంకర్ విలాస్ సెంటర్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు.



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జమిందార్

డాక్టర్ విజయకు జాతీయ అవార్డు



ప్రజాశక్తి-గుంటూరు

లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిట ల్‌లోని అంకినీడు అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి.విజయ, న్యూఢిల్లీలో జరిగిన స్ట్రోక్ ఇన్నోవేషన్ అండ్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2024లో 'బెస్ట్ స్ట్రోక్ కేర్ ప్రొవైడర్ ఆఫ్ ది ఇయర్' జాతీయ అవార్డును అందుకున్నారు. నేషనల్ స్ట్రోక్ కాంక్లేవ్‌లో భాగంగా న్యూఢిల్లీలోని హయత్ రీజెన్సీలో నవంబర్ 30న అవార్డు ప్రధానోత్సవం జరి గింది. ఈ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమంలో వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జయరాజ్ పాండియన్, మాజీ ఎయిమ్స్ డైరెక్టర్ పద్మశ్రీ వాత్సవ్, ఇండియన్ స్ట్రోక్ అసోసి యేషన్ అధ్యక్షులు డాక్టర్ నిర్మల్ సూర్య, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్‌బహ్ల్ వంటి ప్రముఖ స్ట్రోక్ లీడర్లు పాల్గొని దేశంలో పెరుగుతున్న పక్షవాత భారా న్ని పరిష్కరించే విధంగా వివిధ అంశాలు, వినూత్న పరిష్కారాలు, భాగస్వా మ్యాలు, విధా నాలపై చర్చించారు. ఇందులో 'క్వాలిటీ- డ్రైవెన్ స్ట్రోక్ కేర్ అండ్ ఎక్సలెన్స్' అనే అంశానికి నిపుణుల ప్యానెలిస్ట్‌గా వ్యవహరించి ప్రసంగి ంచారు. పక్షవాత రోగులకు ఆమె చేసిన సేవల ఆధారంగా డైమండ్ స్టేటస్ అవార్డు వంటి అనేక అంతర్జాతీయ అవార్డులు లభించాయి.